క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



హోమాలు చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న మృత్యుంజయ శివాలయంలో ఆదివారం పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. వేదపండితులు లక్ష్మణస్వామి, అమరనాథస్వామి, బాలాజీ, గిరి స్వామి ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, కలశస్థానం, అగ్నిప్రతిష్ఠ, మహాగణపతి హోమం,మంత జపములు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, ఆనంద్, రెడ్డప్ప, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ జాతర



జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

పీలేరు రూరల్: మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద వెలసిన శ్రీ అంకాలమ్మ జాతర సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, హోమాలు, అభిషేకాలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాత్రికి చాందినీ బండ్లు, చెక్కభజనలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొంటారని వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



టి.సదుంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వీరిలో 15 మంది కంటికి, ఇద్దరు ఉచిత క్యాన్సర్ ఆపరేషన్లకు ఎంపికైనట్లు వైద్య నిపుణులు పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ శారద, ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు అనిల్, ఆదర్శ, శ్రావ్య, నాని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



పీలేరు రూరల్: మండలంలోని అగ్రహారంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి జయంతిని పురస్కరించుకొని ఆలయంలో గోపూజ, గణపతి హోమం, మరియు ప్రత్యేక అలంకరణ, అభిషేకం, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగగా తిలకించారు.

మదనపల్లెలో..

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం కురవంకలోని శంకరబ్రాహ్మణ సేవా సహకార భవనంలో ఆదివారం నృసింహ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నృసింహ కరావలంబ స్తోత్రము పఠించారు. దేశ రక్షణ, ఆడపిల్లల సంరక్షణ కోసం కామకోటి పీఠాధిపతి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శంకరబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోదండరామయ్య, ప్రకాష్, రఘునందన్, నరసింహారావు,నాగప్రభ, పద్మ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానికంగా వెలసిన శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యం వేద పండితులు ఖన్నాస్వామి, మురళీ శర్మలు స్వామి వారి ప్రతిమకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి వేద మంత్రోచ్ఛారణల నడుమ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకీలో ప్రతిష్టింపజేసి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.

వేసవి సెలవుల్లో హాకీ.. చలాకీ

- ఉచిత శిక్షణ శిబిరానికి స్పందన
- ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు



మైదానంలో హాకీ సాధన చేస్తున్న చిన్నారులు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులంటే పిల్లలకు ఎంతో ఇష్టం. ఎందుకంటే వేసవిలో పాఠశాలలకు సెలవులు కావడంతో ఆటల్లో మునిగి తేలవచ్చు. క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మదనపల్లె బీటీ కాలేజీ హాకీ మైదానంలో గత నెల 28వ తేదీ నుంచి వేసవి హాకీ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణ ఉదయం 6.30 నుంచి 8 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలకు ప్రతి రోజు శిక్షణ ఇస్తున్నారు. కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్, దిలీప్, పవన్,గౌస్‌లు క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు.ఇప్పటి వరకు సుమారు 70 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

నేర్పించే అంశాలు

హాకీ శిక్షణకు వచ్చే క్రీడాకారులకు రోలింగ్, ట్యాపింగ్, పుషింగ్, హిట్ వంటివి నేర్పిస్తున్నారు. ఉదయం మైదానంలో రన్నింగ్ చేయిస్తున్నారు. అనంతరం క్రీడలో మెలకువలు నేర్పిస్తున్నారు. గ్రూపులుగా విభజించి మ్యాచ్‌లు ఆడిస్తున్నారు. ప్రత్యేక శ్రద్ధతో నేర్పిస్తున్నారు.

క్రమం తప్పకుండా సాధన



క్రమం తప్పకుండా హాకీ కోసం సాధన చేస్తున్నా. ప్రతి రోజు కోచ్‌లు చెప్పే విషయాలు వింటూ ప్రాక్టీసు చేస్తున్నా. గత నాలుగు సంవత్సరాలుగా ప్రాక్టీసుకు వస్తున్నా. కోచ్‌లు మంచి శిక్షణ ఇస్తున్నారు. **-రిదా, హాకీ క్రీడాకారిణి, మదనపల్లె**

రోజువారీ తర్ఫీదు మెలకువలు



గత నాలుగేళ్లు నుంచి వేసవి శిక్షణకు వస్తున్నా. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సాధన చేసి మెలకువలు నేర్చుకుంటున్నా. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో హాకీ పోటీల్లో పాల్గొన్నా. హాకీ ఆడటం వల్ల ఉల్లాసంగా ఉండటంతో పాటు చదువులోనూ రాణిస్తున్నా. **-ఉజ్వల, హాకీ క్రీడాకారిణి**

పిల్లల్లో ఆసక్తి పెరిగింది:



హాకీ శిభిరంకు మంచి స్పందన లభిస్తోంది. సుమారు 70 మంది విద్యార్థులు వస్తున్నారు. గ్రూపులుగా విభజించి ప్రాకీస్టు చేయిస్తున్నాం. దాతలు ముందుకు వస్తే మంచిది.విద్యార్థులు హాకీలో బాగా రాణిస్తున్నారు. **-గౌస్, కోచ్, మదనపల్లె**

రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ



రెడ్డెమ్మ తల్లి దర్శనానికి వస్తున్న భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరిం అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. కొందరు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటకా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడం విశేషం.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో కళకళలాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఆశీస్సులు అందించాలని ముత్యాలమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కోసువారిపల్లె సబ్ స్టేషన్ వద్ద వెలసిన గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం వైభవంగా జాతర జరిగింది. గ్రామస్తులు ఆహ్వానంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జాతరకు హాజరయ్యారు. పూజారి రెడ్డప్ప పూజలు చేశారు. మహిళలు దీలు, బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లు, మెరవణీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, స్థానిక నాయకులు కోటిరెడ్డి, కిషోర్,రమణారెడ్డి, రఘు,శంకర్‌రెడ్డి, ,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గోపిదిన్నె బస్టాండులో వెలసిన ఎగువగిండి గంగమ్మ ఆలయంలో తిరునాల వైభవంగా జరిగింది. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

మదనపల్లె సిటీ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మేరీ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి రజనిపై సీఐ దౌర్జన్యం చేయడం అవివేకమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన జరుగుతోందన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు కనీసం గౌరవం కూడా లేదన్నారు. మహిళలపై దౌర్జన్యాలకు దిగితే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రోలింగ్ మల్లిక,వైజయంతి, జయశ్రీ, అపర్ణ, శారదారెడ్డి, వినూతబాయి, శ్యామల, నాగమణి,మంజుల, ఖాదిరిన్ పాల్గొన్నారు.

నల్లవీరగంగా భవాని జాతర ప్రారంభం



గంగాజలం ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

కలికిరి(వాల్మీకిపురం): మండల కేంద్రంలో వెలసిన ప్రాచీన ఆలయం శ్రీనల్లవీర గంగాభవాని ఆలయంలో జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం భక్తిశ్రద్ధలతో జాతరచాటింపు కార్యక్రమంతో జాతర ఉత్సవం ప్రారంభమైంది. ఈ నెల 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. చాటింపు సందర్భంగా ఉదయ 5.30 గంటలకు 108 మంది మహిళలు 108 మట్టి కుండల గంగాజలంతో ఆలయ ద్వారం నుంచి ఊరేగింపుగా సీతారాం టాకీస్, కొత్తపేట వీధి, రాములవారిగుడి వీధి మీదుగా నాగులరాళ్ల వద్దకు వెళ్లి నాగులరాళ్లకు నీళ్ళు పోశారు. అనంతరం నిమ్మనపల్లి రోడ్డులోని నాగులరాళ్ళ వద్దకు వెళ్లి అక్కడా జలాభిషేకం నిర్వహించారు. జాతర ఉత్సవాలలో భాగంగా 16న శేష పోయుట, అఖండ జ్యోతి ప్రజ్వలన, కలశ స్థాపన, ధ్వజారోహణ, ఉలవ దేవర, జాగారం, 17న పాల పొంగు దేవర, 18న అమ్మవారి దీలు, బోణాల సమర్పణ,పుష్ప పల్లకీపై ఊరేగింపు, 19న దోపు తిరుణాళ్ళు జాతరతో ఊరేగింపు ముగుస్తుందని ఆలయ ధర్మకర్త మొగ్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

హజ్‌కు బయలుదేరిన యాత్రికులు



హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న ముస్లిం మత పెద్దలు

మదనపల్లె సిటీ: పవిత్ర హజ్‌యాత్రకు యాత్రికులు ఆదివారం స్థానిక బెంగళూరు బస్టాండు నుంచి ప్రత్యేక వాహనాల్లో బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు. స్థానిక జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి బెంగళూరు బస్టాండు వద్దకు చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, మత పెద్దలు రఫీక్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ జాతర

కలికిరి: మండలంలోని మునెళ్ళపల్లి గ్రామం మూరేవాండ్లపల్లిలో వెలసిన అంకాలమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారితో పాటు ఆలయ ఆవరణలోని గంగమ్మకు అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం వేటను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటా మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు.

దేశ క్షేమం కోసం ప్రత్యేక పూజలు



మట్లివారిపల్లెలో ప్రత్యేక పూజలు

కురబలకోట: దేశ క్షేమం కోసం మండల బీజేపీ అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి స్వగ్రామం మట్లివారిపల్లె ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాకిస్తాన్ దురహంకారానికి నిరసనగా శత్రు దేశ పోరాటంలో భాగంగా మన దేశ సైన్యానికి మరింత బలం, శక్తి యుక్తులు ఇవ్వాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టీచర్ ముత్ర కొండారెడ్డి దేశంపై తొలి నుండి వివిధ సందర్భాల్లో జరిగిన దాడులు, దేశ భక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, ముత్రవారిపల్లె మాధవరెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగరాజు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణులకు వరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

కురబలకోట: ఉచిత వైద్యశిబిరాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ అన్నారు. ఆదివారం అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో బెంగళూరులోని వైదేహి కార్పొరేట్ ఆసుపత్రిచే కాపు (బలిజ) సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన వారు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య బృందం వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు, మాత్రలు అందజేశారు. ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సాయిలోకేష్ మాట్లాడుతూ అంగళ్లు లాంటి ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఇక్కడి వారు బెంగళూరు వెళ్లి వైద్య చికిత్సలు, పరీక్షలు చేయించుకోవాలంటే వ్యయ ప్రయాసలు ఎక్కువ అవుతాయన్నారు. అంగళ్లు శెట్టి సీతారాం ఉదార స్వభావంతో ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వీరి కుటుంబం గ్రామానికి వివిధ సేవలు అందించారన్నారు. ప్రజారోగ్య సేవలో భాగంగా ఇలాంటి శిబిరాలు తరచూ నిర్వహించడం మంచిదన్నారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ దిలీప్‌కుమార్, అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, శెట్టి రామచంద్రారెడ్డి, దారం అనిత, నాదేళ్ల ద్వారకనాథ్, కామకోటి ప్రసాదరావు, ఎంపీడీఓ గంగయ్య, కాకర్ల కృష్ణమూర్తి, సాయినాథ్, గోపి రాయల్, శ్రీధర్, శెట్టి రాజేష్, శ్రీనివాసులు, రాజా, గుణశేఖర్ రెడ్డి, రాజారెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

వీర జవాన్‌కు నివాళి



వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మదనపల్లె రూరల్: దేశ రక్షణలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లా వాసి మురళి నాయక్‌కు పట్టణంలో సేవాలాల్ సర్కిల్ లో భారతీ జనతా గిరిజనమోర్చ అధ్యక్షులు పిల్లస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మురళి నాయక్ అమర్ రోహే అంటూ నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు బండి ఆనంద్ తో కలిసి మాట్లాడుతూ... జమ్ము కాశ్మీర్‌లో పాకిస్తాన్ జరిపిన దాడిల్ని తిప్పికొడుతూ దేశ రక్షణలో వీరమరణం పొందిన మురళి నాయక్ ధీరత్వాన్ని కొనియాడారు. జవాను ఆత్మకుశాంతిచేకూర్చాలని వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భువనేశ్వరిసత్య, మఠంకిరణ్,జర్మన్ రాజు ,శ్రీకాంత్, నారదరెడ్డి, కిరణ్, భానుప్రకాష్, పురుషోత్తం, విష్ణువర్ధన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్ప వృక్షవాహనంపై వెంకన్న



కల్పవృక్ష వాహనంనంపై దర్శనమిస్తున్న స్వామివారు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు భక్తులను అలరింపజేస్తున్నాయి. ఏడో రోజు ఆదివారం కొత్తపేట వాసులు ఉభయదారులుగా స్వామి కల్పవృక్షవాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భజన, లలిత సహస్రనామ ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: యువత రక్తదానం చేయాలని ఎస్ఐ రమాదేవి అన్నారు. ఆదివారం మాతృమూర్తుల దినోత్సవం పురస్కరించుకుని వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తదానం శిబిరం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేయాలనుకున్నా లేదా రక్తం అవసరమైనా దేశవ్యాప్తంగా లక్షలాది మంది రక్తదాతల వివరాలు కలిగిన వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఫ్రెండ్స్ 2 సపోర్టు లో పేర్లు నమోదుద చేసుకోవాలని కోరారు. 38 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్‌విషర్స్ నిర్వాహకులు గిరీష్, విజయ, నవ్య, రెడ్డిశేషు, భానుప్రకాష్, లక్ష్మిపతి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం..

తలసేమియా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో స్థానిక మెట్రోకాంప్లెక్స్ వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన దేశసైనికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు పురుషోత్తం, దినకర్, కిరణ్, చైతు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎన్ మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రముఖ వైద్యులు మహమ్మద్‌గౌస్ వైద్యసలహాలు ఇచ్చారు. యుద్ధంలో మృతి చెందిన వీరజవాన్లకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ మహితాఆనంద్ తదితరులు

పీలేరు: రాష్ట్రంలో కొంతమంది పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగానికి వంత పాడడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళావిభాగం రీజనల్ కోఆర్డినేటర్ మహితాఆనంద్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధించడమే పనిగా పెట్టుకొన్నారని విమర్శించారు. మాజీ మంత్రి బీసీ మహిళ అయిన విడదల రజనీపై పోలీసుల అనుచిత ప్రవర్తన చూస్తుంటే కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ అవలంభిస్తోందనే విషయం అర్థమవుతోందన్నారు. కావాలనే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు నాగరాజమ్మ, లక్ష్మీదేవి, తపురా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

గుర్రంకొండ: జిల్లాలోని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని, అలాగే టమాటా పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తరిగొండలో రైతు సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయట పడేస్తామని, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలిపోయాయన్నారు వ్యవసాయ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతుల పరిస్థితి అధ్వానంగా మారిపోయి అప్పులపాలయ్యారన్నారు. రైతులు పండించిన పట్టలకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకొన్న ధాఖలాలు లేవన్నారు. దీంతో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు పంటల బీమా పథకం కింద వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు రూ.20 వేలను రైతులతో పాటు కౌలు రైతులకు అందించి ఆదుకోవాలన్నారు. టమాటాలను ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఉపాధిహామీ పనిదినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ. 600 చెల్లించాలన్నారు. వ్యవసాయరంగ పరిరక్షణ కోసం ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కౌలురైతు సంఘం కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కలికిరి: మండలంలోని మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు) 1985–86 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. 40 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు సమావేశమవ్వడంతో పాఠశాల ఆవరణంలో సందడి నెలకొంది. కుటుంబాల యోగక్షేమాలతో పాటు చదువుకున్నప్పటి తీపి /జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. బ్యాచ్‌లో కొందరు మరణించి వుండటంతో వారికి సంతాపం తెలిపారు. అప్పటి గురువులైన పి.రెడ్డెప్ప రెడ్డి, జి.శ్రీనివాసులు రెడ్డి, కె. ఆనందరెడ్డి, పి.బ్రహ్మరెడ్డిలను ఘనంగా సన్మానించి గురు భక్తి చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని పాఠశాల హెచ్‌ఎం కోరారు. స్పందించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.